సాక్షి నిర్మల్

బుధవారం । 26 । మార్చి । 2025



కానుకలు వద్దు.. నగదే ఇద్దాం

మంగళ్‌మోట్ ఆదివాసీ మహిళలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆడపిల్లల వివాహాల సమయంలో కానుకలకు బదులు నగదు ఇవ్వాలని నిర్ణయించారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:24	గురు : 4:58



వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /23.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి



పరికరాలు అందజేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: వాహనచోదకులు, ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులకు ట్రాఫిక్ నియంత్రణ, డ్రంకెన్‌డ్రైవ్ మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాష్, రాజేశ్‌మీనా, ఏవో యూనస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, నైలు, గోపీనాథ్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, మల్లేశ్, ఆర్ఐలు రామ్‌నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేశ్, ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న బీఎన్ రావు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పాం సాగుపై శాస్త్రవేత్త డాక్టర్ బీఎన్ రావు, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి బీవీ రమణ మంగళవారం సదస్సు నిర్వహించారు. వేసవిలో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. మొదటి సంవత్సరం నుంచి 30 నెలల వరకు వచ్చిన పూత, గెలలు తొలగించాలని తెలిపారు. డైరీలో సూచించినట్లు తప్పనిసరిగా మొక్కలకు పోషకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూమయ్య, రాంచందర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్న రామయ్య, హార్టికల్చర్ అధికారులు జావీద్‌పాషా, మౌనిక, ఏఈవోలు గణేశ్, భాగ్యలక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీనిధి రుణ బకాయిలను గడువులోపు వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీనిధి రుణాలపై సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా మహిళా సంఘాల సంఖ్య, మంజూరు చేసిన రుణాలు, ఇప్పటివరకు సంఘాలు చెల్లించిన బకాయిలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, శ్రీనిధి ప్రాంతీయ సమన్వయకర్త సరిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భైంసాలో ప్రజావాణి

భైంసాటౌన్: 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్'లో భాగంగా బుధవారం భైంసాలో ఎస్పీ జానకీ షర్మిల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక పాత రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అందుబాటులో ఉండనున్నారు. డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు ఎస్పీని నేరుగా కలిసి సమస్యలు తెలిపి పరిష్కరించుకోవచ్చు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజేందర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ సౌమ్య, గైనకాలజిస్ట్ విస్సీ, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్వేత, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

మీసేవ లైసెన్స్ రద్దు చేయాలి

పెంబి: మండలకేంద్రంలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు నరేశ్ లైసెన్సును రద్దు చేయాలని మండలంలోని కోరకంటి గ్రామానికి చెందిన బనావత్ అనిల్‌కుమార్, పలువురు మంగళవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. మీసేవలో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం నిర్ణయించిన రూ.45 కంటే అధికంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం మీసేవ కేంద్రం నిర్వహిస్తున్నాడని.. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.



నిర్మల్‌పై నిర్లక్ష్యమేలా?

- అభివృద్ధి కోసం నిధులివ్వరు..
- ఆశావహులకు పదవులివ్వరు..
- పక్కజిల్లాకు నాలుగైదు పోస్టులు
- జిల్లాపై ఎప్పుడూ చిన్నచూపే..
- రాజకీయ కేంద్రమైనా అనిశ్చితే..

అధికారంలో ఏ ప్రభుత్వమున్నా.. ఏ పార్టీ పగ్గాలు చేపట్టినా.. జిల్లాకు అభివృద్ధి నిధులు, నేతలకు పదవులూ ఇవ్వడం లేదన్న వాదన పెరుగుతోంది. అభివృద్ధితోపాటు రాజకీయాల్లోనూ తమ ప్రాంతాన్ని చిన్నచూపు చూస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా బడ్జెట్‌లలోనూ నిధులు రాలేదు. పక్కనున్న నిజామాబాద్ జిల్లాలో ఒకే నియోజకవర్గం నుంచి ఇద్దరుముగ్గురికి రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ నేతలకు ఎలాంటి పోస్టులు ఇవ్వడం లేదు. రాజకీయంగా చక్రం తిప్పిన జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.

– నిర్మల్

జిల్లాకు ఏమిచ్చారు..!?

తెలంగాణ ఏర్పాటు కావడం, జిల్లాగా ఆవిర్భవించడంతో ఇక నిర్మల్‌కు తిరుగుండదన్న భావన ప్రజల్లో ఏర్పడింది. దీనికి తోడు నిర్మల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఇంద్రకరణ్‌రెడ్డికి రెండు పర్యాయాలు మంత్రి పదవి రావడంతో మరింతగా అభివృద్ధిపై ఆశలు పెరిగాయి. స్థానిక పాలకులు ప్రయత్నాలు చేసినా.. ప్రభుత్వాల నుంచి జిల్లాకు ప్రత్యేకంగా వచ్చిందేమీ లేదు. మెడికల్ కాలేజీ కూడా జిల్లాకొకటి ఇవ్వడంలో భాగంగానే వచ్చింది. కానీ.. కచ్చితంగా నిర్మల్ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కావాలని నిండుసభలో అప్పటి సీఎం కేసీఆర్‌ను అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అడిగితే, ఆయన నిర్మల్‌కు కాకుండా పక్కనున్న ఆదిలాబాద్‌కు కేటాయించడం చోద్యం. సాఫ్ట్‌వేర్ హబ్ ఏర్పాటు చేస్తామన్న హామీ ఊసే లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో వచ్చిన రెండు పరిశ్రమలు ప్రారంభమవుతాయన్న గ్యారంటీ లేకుండా పోయింది. పర్యాటక అభివృద్ధికి ఏ జిల్లాలో లేనన్ని అవకాశాలు నిర్మల్ జిల్లాలో ఉన్నా.. కనీసం ఆ దిశగా ఆలోచించిన సందర్భాలే లేవు. కళ్లముందే చారిత్రక కట్టడాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టింపులేదు. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరిన తర్వాత కూడా జిల్లాలో కొత్తగా వచ్చిన అభివృద్ధి ఆనవాళ్లు ఒక్కటీ లేకపోవడం శోచనీయం.

మనోళ్లకు ఎందుకివ్వరు...!?

తాజాగా మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో జిల్లాలో మళ్లీ పోస్టులపై చర్చ కొనసాగుతోంది. ఇంకెన్నాళ్లు

రాజకీయంగా అదే దుస్థితి..

జిల్లా అభివృద్ధికి నిధులే కాదు.. ఇక్కడి నేతలకూ పదవులు ఇవ్వడం లేదన్న వాదన బలంగా ఉంది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అల్లోలకు మంత్రి పదవి మినహా రాష్ట్రస్థాయిలో ఒక్క కార్పొరేషన్ పోస్టు కూడా ఇవ్వలేదు. పదేళ్లపాటు ఎంతోమంది సీనియర్ నేతలు నామినేటెడ్ పోస్టులపై పెట్టుకున్న ఆశలు అడియాశలే అయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అదే పరిస్థితి రిపీట్ అవుతోంది. ఇప్పటికీ ఒక్కటంటే ఒక్క నామినేటెడ్ పోస్టు జిల్లాకు దక్కకపోవడం గమనార్హం.

ఇలా జిల్లాపై చిన్నచూపు చూస్తారన్న వాదన పెరుగుతోంది. డీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిస్తున్న కూచాడి శ్రీహరిరావుకు ఏదైనా ఒక పదవి దక్కుతుందని ఏడాదిగా చర్చకు వస్తున్నా.. పార్టీ అధిష్టానం మాత్రం స్పందించడం లేదు. జిల్లాలో ఎంతోమంది సీనియర్ నేతలున్నా.. వారికి ఎలాంటి ప్రాధాన్యత దక్కడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గర అని పేరున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకూ మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఉంది.

పక్క జిల్లాతో పోలిస్తే..

గతంలో 'సాక్షి' చెప్పినట్లు 'గంగదాటని పదవులు' అన్నట్లు ఇప్పటికీ గోదావరి(గంగ) దాటడం లేదు. జిల్లాకు పక్కనే గోదావరి దాటగానే నిజామాబాద్ జిల్లాలో ఉన్న బాల్కొండ నియోజకవర్గం నుంచే ముగ్గురు నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చారు. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇదే నియోజకవర్గానికి చెందిన సుంకెట అన్వేశ్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పోస్టు దక్కింది. రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్‌రెడ్డిది కూడా బాల్కొండ నియోజకవర్గమే కావడం గమనార్హం. ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నా.. ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చారు. ఇదొక్కటి చాలు.. జిల్లాపై ఉన్న చిన్నచూపునకు ప్రత్యక్ష ఉదాహరణ.

జిల్లాపై చిన్నచూపు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ఎప్పటి నుంచో చిన్నచూపు ఉంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కూడా నిర్మల్‌నూ అలాగే చూస్తున్నారు. అభివృద్ధికి నిధులివ్వడం లేదు. ఇక్కడి నేతలకూ పదవులు దక్కడం లేదు. ఇప్పటికైనా జిల్లా సమగ్ర అభివృద్ధికి సర్కారు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

– ఎంసీ లింగన్న, నిర్మల్ సిటిజన్స్‌ఫోరం కన్వీనర్

సర్కారు విద్యకు సాంకేతిక దన్ను

- ప్రైమరీ స్కూళ్లకు కంప్యూటర్లు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిపరుస్తూ మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. పాఠశాల విద్యావ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటికే అనేక సౌకర్యాలు సమకూరుస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 50 మందికి పైగా విద్యార్థులున్న ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఐదు చొప్పున కంప్యూటర్లు సరఫరా చేయాలని నిర్ణయించింది. రానున్న 2025–26 విద్యాసంవత్సరం జూన్ తొలి నాటికే ఆయా పాఠశాలల్లో కంప్యూటర్లు అందుబాటులోకి తేవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కృత్రిమ మేధా టూల్స్ ద్వారా ఇంగ్లిష్, గణితం బోధనలో వినియోగిస్తోంది. దీంతో జిల్లాలోనూ ప్రభుత్వ రంగంలోని 535 ప్రైమరీ స్కూళ్లలో కంప్యూటర్లు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు 24వేలకు పైగా విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

ప్రైవేట్‌కు దీటుగా..

ప్రైవేట్ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ అన్ని సదుపాయాలు సమకూర్చుతోంది. అవసరమున్న చోట ఉపాధ్యాయులను నియమిస్తూనే మరింత నాణ్యమైన బోధన అందించాలనే లక్ష్యంతో వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అన్ని స్కూళ్లలో సదుపాయాలు కల్పిస్తోంది. ఇప్పటికే విద్యుత్, ఫ్యాన్లు, తరగతి గదులు, ప్రయోగశాల గదులు అందుబాటులోకి వస్తున్నాయి. మరోవైపు కేంద్రం ద్వారా పీఎంశ్రీ పథకంతో పాటు తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్ అందుబాటులోకి వచ్చాయి. ఇంకా గ్రీన్ బోర్డులు లాంటివీ వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఏఐ ఆధారిత విద్యాబోధన కోసం 16 పాఠశాలలు ఎంపిక చేశారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సముచిత నిర్ణయమే

మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన అభ్యసన ప్రక్రియలో నూతన సాంకేతిక విధానాలను వినియోగించడం శ్రేయస్కరం. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కంప్యూటర్ల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగిస్తూ బోధన చేస్తే వారికి పాఠ్యాంశం సులభంగా అర్థమవుతుంది.

– రమణారావు, పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి

భైంసాలో పెట్టుబడి పేరిట దగా!

- రూ.లక్షల్లో కోల్పోయిన బాధితులు

భైంసాటౌన్: ఈజీ మనీకి ఆశపడి పలువురు మోసపోతున్న ఘటనలు తరచూ చూస్తూనే ఉన్నాం. జిల్లాలో యూబిట్ కాయిన్ దందా వెలుగుచూసిన విషయం తెలిసిందే. తాజాగా భైంసా పట్టణంలోనూ ఒకరు ఈజీ మనీ పేరిట పలువురిని మోసగించినట్లు తెలిసింది. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పేరిట డబ్బులు సేకరించి, ప్రస్తుతం చేతులెత్తేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మోసపోతున్న వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, నిరుద్యోగులు, మహిళలు ఉండడం గమనార్హం.

భైంసా కేంద్రంగా..

ఖానాపూర్‌కు చెందిన ఒకరు భైంసా కేంద్రంగా పెట్టుబడిపై కమీషన్ పేరిట పలువురిని మోసగించినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా స్థానికంగా స్థిరపడి ఈజీ మనీ పేరిట పరిచయస్తులకు ఆశ జూపి వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. తాను మరొకరితో కలిసి రోబో ద్వారా ట్రేడింగ్ చేస్తున్నానని, తన వద్ద పెట్టుబడి పెడితే రోజుకు ఒక శాతం కమీషన్ ఇస్తానని నమ్మబలికాడు. అంటే, రూ.10వేలు పెట్టుబడి పెడితే, రోజుకు రూ.100 చొప్పున వారి ఖాతాల్లో వేస్తానని ఆశ చూపాడు. ఇలా తనకు తెలిసినవారిని కొందరిని ముగ్గులోకి దింపాడు. ప్రారంభంలో రెగ్యులర్‌గా కమీషన్ ఇవ్వడంతో పూర్తిగా నమ్మిన కొందరు వారి బంధువులు, స్నేహితులతోనూ పెట్టుబడి పెట్టించారు. ఇలా ఒక్క వ్యక్తే తన పరిచయస్తుల నుంచి దాదాపు రూ.25లక్షల వరకు పెట్టుబడి పెట్టించినట్లు తెలిసింది. కొద్దినెలలుగా కమీషన్ ఇవ్వకపోవడంతో తమ డబ్బులు తిరిగివ్వాలని కోరితే చేతులెత్తేసినట్లు సమాచారం.

ఇప్పటికే పలువురికి జైలు

జిల్లాలో యూబిట్ కాయిన్ దందా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఇందులో పలువురు జైలుపాలైన విషయమూ విదితమే. అలాగే, గతంలో పట్టణానికి చెందిన ఓ యువకుడు చుట్టుపక్కల గ్రామాల్లోని పలువురి బ్యాంక్ ఖాతాలు సేకరించి, వాటిలో అనుమానాస్పద లావాదేవీలు నిర్వహించిన ఘటన వెలుగు చూసింది. బెట్టింగ్ దందా నిర్వహించే భైంసాకు చెందిన ఒకరు తన వద్ద పనిచేసే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో అధిక మొత్తంలో నగదు లావాదేవీలు జరపడంతో, ఈ విషయమై గతనెలలో వారి మధ్య గొడవ తలెత్తిన విషయం తెలిసిందే. ఇలా.. యూబిట్, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇలాంటి నేరాలపై ముందస్తుగా నిఘా పెంచి పటిష్ట చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి



నర్సాపూర్(జి): కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సాపూర్ (జి): జాబ్‌కార్డున్న ప్రతీ కూలీకి పని కల్పించాలని ఇన్‌చార్జి డీఆర్డీవో, డీపీవో శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎండలు ముదురుతున్నందున ఉదయమే పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని సాంగ్వి చెరువు వద్ద చేపట్టిన ఉపాధిహామీ పనులను డీపీవో శ్రీనివాస్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం చొండిలోని నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి సురేశ్ తదితరులున్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ నర్సరీని డీపీవో శ్రీనివాస్ పరిశీలించారు. మొక్కలకు నిత్యం నీటిని అందించాలని సూచించారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్ ఆదేశించినా సాగునీరివ్వరా?



సదర్‌మాట్ ద్వారా కడెం ప్రాజెక్ట్‌కు వెళ్తున్న నీళ్లు

కడెం: పక్క నుంచే సాగునీరు వెళ్తున్న మళ్లించుకోలేని దుస్థితిలో మండలంలోని సదర్‌మాట్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే సాగు నీరందక కొందరి పొలాలు ఎండడంతో కలెక్టర్ అభిలాష అభినవ్ వాటిని పరిశీలించారు. ఏప్రిల్ చివరి వరకు సదర్‌మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని లింగాపూర్, నచ్చన్‌ఎల్లాపూర్, మాసాయిపేట్, కొత్తమద్దిపడగ, పాత మద్దిపడగ తదితర గ్రామాలకు సదర్‌మాట్ కాలువ ద్వారా వారబందీ పద్ధతిన సాగు నీరందించాలి. కానీ, ఒక్కరోజు మాత్రమే నీటిని అందిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. సదరమాట్ కాలువ ద్వారా కడెం ప్రాజెక్ట్‌కు ఫీడింగ్ చేయడంతో తమకు అన్యాయం జరుగుతోందని కొత్తమద్దిపడగ, పెద్దూర్‌తండా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి సాగునీరందించాలని కోరుతున్నారు.

డిమాండ్లు నెరవేర్చేదాకా ఉద్యమిస్తాం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: డిమాండ్లు నెరవేర్చేదాకా ఉద్యమిస్తామని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీ సుజాత పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద గల గాంధీవిగ్రహం చుట్టూ ఆశ వర్కర్లు మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. 'చలో హైదరాబాద్'కు వెళ్తున్న ఆశ వర్కర్లను ముందస్తు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపు ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, కోశాధికారి రామలక్ష్మి, నాయకులు భాగ్యలక్ష్మి, మంగ, రాణి, సరోజ, సంగీత, లావణ్య, గంగ, లక్ష్మి, కృష్ణవేణి, శారద, పద్మ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్‌కు తెల్లదోమ..!

- చెట్ల పెరుగుదల, దిగుబడిపై ప్రభావం
- యాజమాన్య పద్ధతులతో నియంత్రణ

ఆయిల్‌పామ్ సాగు వివరాలు

జిల్లాలో సాగు విస్తీర్ణం : 8,165 ఎకరాలు

సాగు చేస్తున్న రైతుల సంఖ్య : 3,304



తెల్లదోమ కారణంగా రంగు మారిన ఆకు

మామడ: ఆయిల్‌పామ్‌ను తెల్లదోమ ఆశిస్తుండటంతో జిల్లా రైతులను ఉద్యానశాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ తెగులు కనిపించిందని అధికారులు పేర్కొంటున్నారు. దీని కారణంగా మొక్కల పెరుగుదల లోపిస్తుంది. దిగుబడులపై ప్రభావం చూపనుంది. తెల్లదోమ నియంత్రణకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ రైతులకు చేస్తున్న సూచనలు..

లక్షణాలు.. నష్టాలు

ఆకుల దిగువ భాగంలో వంకర తిరిగిన తెల్లదోమ గుడ్లు, ఆకులపై తెలుపు మైనపు పదార్థం కనిపిస్తుంది. జిగట పదార్థంతో నల్ల మసి అచ్చు ఏర్పడుతుంది. తెల్లదోమ మొక్కను ఆశించిన అనంతరం వెంటనే మొక్కను చంపదు. కానీ, మొక్క పెరుగుదల, దిగుబడిని తగ్గిస్తుంది. మొక్క నుంచి తెల్లదోమ పోషకాలు నీటిని పీల్చడం ద్వారా ఒత్తిడిని కలిగిస్తుంది. మెరిసే జిగట ద్రవాన్ని విడుదల చేస్తుంది. ఇది నల్ల మసి అచ్చు పెరుగుదలకు దోహదం చేస్తుంది. ఈ జిగట పదార్థం చీమలు, కందిరీగలను ఆకర్షిస్తుంది. ఇవి తెల్లదోమను కాపాడుతాయి.

సహజ నియంత్రణ పద్ధతిలో నివారణ

నీటి ఒత్తిడితో ఆకులను కడగడం ద్వారా దోమ ఉధృతిని తగ్గించవచ్చు. మొక్కలపై గుడ్లు అపరిపక్వ దశలోనే తొలగించాలి. పసుపు రంగు జిగురుతో కూడిన అట్టలు ఉపయోగించి తెల్ల దోమలను ఆకర్షించి నియంత్రించవచ్చు. బంతిపూల మొక్కలను పెంచడం ద్వారా పూలు విడుదల చేసే లిమొనెన్ వాయువు తెల్లదోమను నివారిస్తుంది. ఆముదంతో పూత పూసిన టార్పాలిన్‌ను ఉపయోగించి తక్కువ ఖర్చుతో అరికట్టవచ్చు.

రసాయన పద్ధతి ద్వారా..

నర్సరీల నుంచి మొక్కలు నాటేందుకు తీసుకువచ్చేటప్పుడు ప్రతీ మొక్కను పరిశీలించాలి. చీడపీడల బెడద లేని మొక్కల్ని మాత్రమే నాటాలి. తెగులు సోకిన ప్రాంతాల నుంచి మొక్కల సేకరణ నిలిపివేయాలి. మసి అచ్చు పెరుగుదల, జిగట పదార్థం కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

సేంద్రియ పద్ధతుల ద్వారా..

పవర్ స్ప్రేయర్, ట్రాక్టర్ స్ప్రేయర్‌తో ఐదు గ్రాముల డిటర్జెంట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 200 లీటర్ల నీటిని ఉపయోగించాలి. 10 మిల్లీలీటర్ల వేప నూనె లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు ఆకుల కింది భాగంపై పిచికారి చేయాలి. 15 రోజుల తర్వాత జీవ నియంత్రణ పద్ధతిలో 100 లీటర్ల నీటిలో లీటర్ శిలీంద్ర కల్చర్, నాలుగు కిలోల బెల్లం, నాలుగు కిలోల గంజి పిండిని కలిపి వారంపాటు మరగనివ్వాలి. ఈ ద్రావణాన్ని 5ఎంఎల్‌ను లీటర్ నీటికి కలిపి ఆకుల కింది భాగంపైన పిచికారి చేయించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు పంటకు సోకే చీడపీడలు, నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. మొక్కలకు ఇతర ప్రాంతాల్లో తెల్లదోమ సోకుతుంది. జిల్లాలో ఆయిల్‌పామ్ రైతులు అప్రమత్తంగా ఉండాలి. తెల్లదోమ సోకిన లక్షణాలు కనిపిస్తే ఉద్యానవనశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

– రమణ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

ఆర్డీవోకు సన్మానం

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కోమల్‌రెడ్డిని హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్ వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్, రాష్ట్ర కార్యదర్శి సుభాష్, స.హ చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, భైంసా డివిజన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ హుజూర్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్, మినాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను పట్టించుకోవద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అరుణ్ కుమార్

నిర్మల్‌రూరల్: ఏయే పనిలోనైనా గెలుపోటములు సాధారణమేనని.. వాటిని పట్టించుకోకుండా మన బాధ్యతలను నిర్వర్తిస్తూ ముందుకెళ్లాలని సైక్రియాటిస్ట్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సోఫీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ముందుకుసాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఒత్తిడి నివారణ చర్యలు, ఆహార నియమాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుడిమల్ల రాజు లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్ఎం గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వడ్యాల్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లులు వసులు చేశారు. మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కనకాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఖానాపూర్ వైపు నుండి వేగంగా వస్తున్న కారు రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్, ఏఎస్సై నారాయణరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీకొని ఇద్దరికి ...



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

దస్తురాబాద్: బుట్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్ గ్రామ సమీపంలో మంగళవారం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చెన్నూర్‌కు చెందిన శంకర్‌గౌడ్, కలమడుగుకు చెందిన రాకేశ్ ద్విచక్ర వాహనంపై కలమడుగు నుంచి చెన్నూర్‌కు వస్తుండగా పాండ్వాపూర్–కలమడుగు రహదారిపై టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శంకర్ గౌడ్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: ఎడ్లబండ్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఫారెస్టు డివిజన్ అధికారి రేవంత్‌చంద్ర తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి గోపాల్‌పూర్ గ్రామ శివారులో మారుతిగూడకు చెందిన వ్యక్తులు రెండు ఎడ్లబండ్లపై కలపను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు పారిపోయారని, కలపను, ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కలప విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడిలో సిరిచెల్మ ఎఫ్ఆర్వో నాగవత్ స్వామి, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, సిరికొండ డీఆర్వో నరేష్, తదితరులు ఉన్నారు.

కానుకలు వద్దు.. నగదే ఇద్దాం!

- మంగళ్‌మోట్ మహిళ వినూత్న ఆలోచన
- ఆడపిల్ల పెళ్లికి వస్తువులకు బదులు నగదే ఇవ్వాలని నిర్ణయం..
- ఆదివాసీ మహిళ ఐడియా.. జిల్లా అంతా ఆచరణ
- పెళ్లి కూతుళ్లకు నగదు ఇస్తూ అండగా నిలుస్తున్న గూడేలు



పెళ్లికూతురుకు నగదు అందజేస్తున్న మహిళలు (ఫైల్)



మెస్రం శ్రీదేవి

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం తర్నం(బి) పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన మంగళ్‌మోట్ ఆదివాసీ మహిళలు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆడపిల్లల వివాహం కుటుంబ పెద్దకు భారం కాకూడదని భావించి వివాహ సమయంలో కట్నకానుకల కింద ఇచ్చే ఇత్తడి, వెండి, స్టీల్ సామగ్రికి బదులు నగదు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. ఆదివాసీ మహిళలు తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా మారింది. ఆదివాసీ గూడేల్లో ఎక్కడ పెళ్లి జరిగినా కట్నకానుకలు తీసుకోవడం లేదు. వాటికి బదులుగా తోచినంత నగదు అందించి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

వయసు చిన్నది..ఆలోచన పెద్దది

మంగళ్‌మోట్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీదేవి ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. ఐటీడీఏ తరఫున హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జీఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసి కొంతకాలం ప్రైవేట్ ఉద్యోగం చేసింది. 2018లో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లలో కట్నం కింద సామగ్రి ఇస్తుండడంతో డబ్బులు వృథా అవుతున్నాయని శ్రీదేవితో పాటు పలువురు మహిళలు గుర్తించారు. ఈ మేరకు కట్నకానుకలు నిషేధించి వాటికి బదులుగా నగదు ఇవ్వడంతో పెళ్లి కూతురు ఇంటి పెద్దకు కొంత ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు అవుతుందని భావించి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేసింది. గ్రామపెద్దలు సైతం ఆమెతో ఏకీభవించారు. ఇక నుంచి కట్నం కింద వస్తువులు ఇవ్వడం నిషేధమని తీర్మానించి అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మార్చి 3న మంగళ్‌మోట్‌లో జరిగిన వసంత వివాహానికి ఊరి ఆడపడుచులంతా కలిసి రూ.20 వేల నగదును అందజేశారు. మారుమూల గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల ప్రజలను ఆలోచింపజేసింది.

ఇటీవల పలుచోట్ల ఇలా..

- ఈనెల 14న సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడకు చెందిన యువతి వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.20 వేల నగదు అందజేశారు.
- ఈ నెల 20న ఇంద్రవెల్లి మండలం సమాకలో తొడసం గౌరుబాయి వివాహం కొట్నక్ దేవ్‌రావుతో జరిగింది. గ్రామస్తులు ప్రతీ ఇంటి నుంచి రూ.200 జమచేసి రూ.24,900 నగదును కట్నకానుకలకు బదులుగా అందజేసినట్లు గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావు తెలిపారు.
- ఈ నెల 20న బజార్‌హత్నూర్ మండలంలోని అనంత్‌పూర్ గ్రామానికి చెందిన సేవంతకు ఇచ్చోడ మండలంలోని బొజ్జుగూడకు చెందిన నగేష్‌తో వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.22 వేల నగదు అందించి అండగా నిలిచారు.

గర్వంగా ఉంది



మా గూడెంలో తీసుకున్న నిర్ణయం పలు గూడేల్లో అమలు చేయడం గర్వంగా ఉంది. కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. 50 ఏళ్ల క్రితం కట్నకానుకలు లేకుండానే పెళ్లిళ్లు జరిగేవి. వరుడు వధువు ఇంటివద్ద, వధువు వరుడి ఇంటివద్ద నెలరోజులు పనులు చేసేవారు. వారి పని నచ్చితే పెద్దలు వారిద్దరికి వివాహం జరిపించేవారు.– కుంర భీంరావు, భూమవ్వ, మంగళ్‌మోట్, గ్రామపటేల్ దంపతులు

అరుదైన పక్షి



దహెగాం మండల కేంద్రంలో మంగళవారం అరుదైన పక్షి కనిపించింది. ఎండవేడికి తట్టుకోలేక దుకాణ సముదాయాల్లోకి వచ్చింది. స్థానికులు పట్టుకుని నీటిని తాగించారు. ఎఫ్ఎస్‌వో సద్దాం దృష్టికి తీసుకెళ్లగా దీని పేరు గోల్డెన్ ఓరియల్ అని పేర్కొన్నారు. ఇది అటవీ ప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. – దహెగాం

విద్యార్థుల జంగల్ సఫారీ



హాజీపూర్ మండలం గఢ్‌పూర్ మండల పరిధిలోని ఎంసీసీ క్వారీలో గల జంగల్ సఫారీలో మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన బీజెడ్‌సీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రెక్కింగ్ చేశారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ వివిధ రకాల చెట్లతో పాటు మెడికేటెడ్ చెట్లు, వివిధ రకాల పక్షులు, జంతువుల గురించి తెలుసుకున్నారు. గడ్డి వనాలు, ఎత్తయిన కొండలు, అటవీ అందాలను తిలకించారు. ఎఫ్‌బీవోలు రాజేందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

ఏటీఎం కార్డు మార్చి.. రూ.40వేలు నొక్కేసి..!



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఆదర్శ్

భైంసాటౌన్(ముధోల్): ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన ఓ యువకుడిని ఏమార్చి అతని కార్డును తన వద్ద ఉన్న కార్డుతో మార్చి నగదు తస్కరించిన ఘటన భైంసా పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని దేగాంకు చెందిన ఆదర్శ్ బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఏటీఎంకు వచ్చాడు. డబ్బులు విత్‌డ్రా చేస్తున్న క్రమంలో చింతల్‌బోరికి చెందిన జాదవ్ బాలాజీ డబ్బులు డ్రా చేసిస్తానని చెప్పి అతని కార్డు తీసుకున్నాడు. కొద్దిసేపటికి డబ్బులు రావడం లేదని, బ్యాంకులో అడగాలంటూ తన వద్ద కార్డు మార్చి ఇచ్చాడు. గమనించని ఆదర్శ్ పని నిమిత్తం గ్రామానికి వెళ్లగా రూ.పదివేల చొప్పున రూ.40వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే భైంసాకు చేరుకుని ఏటీఎం పరిసరాల్లో గాలించగా సదరు వ్యక్తి కనిపించాడు. నిలదీయగా పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా ఆదర్శ్ ఏటీఎం కార్డు, జేబులో నగదు లభించింది.

జవహర్ నవోదయకు 63 మంది ఎంపిక

కుంటాల(ముధోల్): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికిగానూ ఆరోతరగతిలో ప్రవేశానికి జనవరి 18న నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కుంటాలలోని సృజన విద్యాలయంలో 34, విజయసాయి పాఠశాలలో ఇద్దరు, శాంతినికేతన్ పాఠశాలలో 15, కల్లూర్‌లోని శ్రీసాయి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, సంతోష్, శ్రీకాంత్, బోగ ప్రవీణ్, స్వప్న తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన భగత్‌కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన కలీమొద్దీన్ అలియాస్ కల్లు ఇంటి వద్ద నుంచి మంగళవారం మధ్యాహ్నం గంజాయి తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా కలీమొద్దీన్‌పై ఇదివరకే పలు కేసులతో పాటు సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. ఇదివరకే ఆయనను బైండోవర్ సైతం చేయడం జరిగిందన్నారు. భగత్‌కృష్ణను అరెస్టు చేసి బైండోవర్ చేయగా, కలీమొద్దీన్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా కిందపడడంతో లైన్‌మెన్‌కు గాయాలైనట్లు విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్ తెలిపారు. లైన్‌మెన్ రాజు మరమ్మతు పనులు చేస్తుండగా పైన ఉన్న 33 కేవీలైన్ వైరు కింద ఉన్న లైన్‌వైరుకు తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

రామకృష్ణాపూర్: పట్టణంలో నివసించే ఓ బాలిక(10)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాలిక నో రుమూసి ఇంట్లోకి రమ్మని అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులికుంట గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డీ.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపురంగు నైట్‌ప్యాంటు, నల్లని చారల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురికి స్వల్పగాయాలు



108లో క్షతగాత్రులు

సారంగాపూర్(నిర్మల్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని శంకర్‌నాయక్ తండావాసులు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా సారంగాపూర్–అడెల్లి గ్రామాల మధ్య కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ మారుణిబాయి, నీలాబాయి, సవిత, శశికళ, అన్నపూర్ణ, రతన్‌సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందివ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

దండేపల్లి: గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి భూమి విష్ణువర్ధన్ (22) రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం బైక్ తీసుకుని ఇంటినుండి బయటికి వెళ్లాడు. రాత్రి సమయంలో బైక్ గూడెం గోదావరి వంతెనపై నిలిపి ఉంచినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. మంగళవారం ఉదయం గోదావరి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలి ఉంది. మృతుడు ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతుని సోదరుడు మణిదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

గొడిసిర్యాలలో పురుగుల మందు తాగి మరొకరు ...



నేరెళ్ల అశోక్

దస్తురాబాద్: పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలోని గొడిసిర్యాలలో చోటు చేసుకుంది. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నేరెళ్ల అశోక్ (23) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం అతని చిన్నాన్న కుమారుడు పానుగంటి పవన్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనయ్యాడు. గొడిసిర్యాల ఎక్స్‌రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో అతని తమ్ముడు పవన్ ఆత్మహత్య చేసుకున్న స్థలంలోనే అశోక్ పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు జన్నారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసర గోదావరిలో దూకి మహిళ ...

బాసర(నిర్మల్): బాసర గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన అనురాధ (35)కు అదే గ్రామానికి చెందిన సాయిలుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిలు నిత్యం మద్యం సేవించి ఇంటికివచ్చి వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లింది. మంగళవారం తల్లి రాజవ్వకు ఫోన్‌చేసి విషయం తెలిపింది. అనంతరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా మరణాయుధాలతో సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారిగూడకు చెందిన సలీం ఖాన్ సోషల్ మీడియాలో తల్వార్‌తో ఒక పోస్టును పెట్టడం జరిగిందన్నారు. సుమోటో కేసుగా నమోదు చేసి మంగళవారం సలీం ఖాన్‌పై ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే సలీం ఖాన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమెరికాలో మెరిసిన యశిక



మాధవరపు యశిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన మాధవరపు యశిక ప్రతిష్టాత్మకమైన యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్(యూఎస్ఎంఎల్ఈ)లో అరుదైన ఘనత సాధించింది. రెండు విడతలుగా జరిగిన పరీక్షల్లో ఫ్యామిలీ మెడిసిన్‌లో సీటు సంపాదించింది. మూడేళ్ల తర్వాత వచ్చే పీజీ పట్టాతో ప్రపంచంలోని ఏ దేశంలోనైనా వైద్యసేవలు అందించేలా అవకాశాన్ని అందిపుచ్చుకుంది. యశిక 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లో పూర్తి చేసింది. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలతో అనుసంధానమైన అమెరికా న్యూయార్క్‌లోని జేవియర్ వైద్య కళాశాలలోని ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) కోర్సును పూర్తి చేసి అమెరికాలోని చికాగోలో 18 నెలల స్టెప్–1, స్టెప్–2 క్లినికల్స్ కూడా పూర్తి చేసింది. తల్లిదండ్రులు శిల్ప, రాజేశ్వర్‌రావు రాజకీయాల్లో రాణిస్తున్నారు. యశికను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు హాజీపూర్ మండల వాసులు ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝూ

మంచిర్యాలక్రైం: గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ అన్నారు. మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టులు, కేసుల దర్యాప్తులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గేమింగ్ యాక్ట్, తదితర కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీస్ అధికారి చట్టపరిధిలో పనిచేయాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పారదర్శకంగా, న్యాయపరంగా విచారణ జరపాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో విలేజ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి విక్రయం, సేవించేవారిపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, నరసింహులు, మల్లారెడ్డి, ఏఆర్ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంచుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆంగ్లభాషపై విద్యార్థులు ప్రావీణ్యం పెంచుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోస్ సంస్థ అందిస్తున్న సేవలతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఏసీఎం జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉదవ్, రాథోడ్ శివాజీ, క్రీడల అధికారి పార్థసారథి, దేవ్‌రావు, బోస్ సంస్థ నిర్వాహకులు రోమిల, నిక్షిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ విచారణ



సుంకిడిలో విచారణ జరుపుతున్న సభ్యులు

తలమడుగు: మండలంలోని సుంకిడి, ఝరి గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం గ్రామాల్లో విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఏడీ రాంకిషన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై అంజమ్మ, వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి ఝరి గ్రామానికి చెందిన రైతు గడం పోతారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు. రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉంది? కౌలుకు ఎన్ని ఎకరాలు తీసుకున్నాడు? పెట్టుబడి సాయం ఏబ్యాంకులో తీసుకున్నాడు? ప్రైవేట్ అప్పులు ఎంత తీసుకున్నారు? అని వివరాలు సేకరించారు. అనంతరం సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. రైతు వ్యవసాయ వివరాలు, పట్టా పాసు బుక్‌లను, బ్యాంక్ ఖాతాలు, అప్పులు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.